క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదిలి: మల్లవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ నూతన విద్యుత్ లైన్ ఏర్పాటులో భాగంగా మల్లవరం, సూదనగుంట, అన్నవరం, కుంచేపల్లి ఫీడర్లకు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సోమవారం ఓ ప్రకటనలో వివరించారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సీపీఎస్ పోరు పోస్టర్ ఆవిష్కరణ



మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఉద్యోగులు

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చలో విజయవాడ సీపీఎస్ ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ ఒకటో తేదీన విజయవాడలో నిర్వహించనున్న సీపీఎస్ ఉద్యోగుల ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, ఎంఈఓలు సీహెచ్ రమణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఎస్కార్ట్ వాహనం



రోడ్డు మార్జిన్‌కు దిగువన ఉన్న పోలీస్ వాహనం

మార్కాపురం: పోలీసు(ఎస్కార్టు) వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన మార్కాపురం మండలం చింతగుంట్ల–కుంట మధ్య సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. సోమవారం మార్కాపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వారి కాన్వాయ్‌లోని ఎస్కార్టు వాహనం అదుపు తప్పి ఉంటుందని తెలుస్తోంది. కాగా ఈ ప్రమాదం నుంచి పోలీసులు సురక్షితంగా బయటపడ్డారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కంభం చెరువులో కారు బోల్తా



చెరువులో పడిపోయిన కారు

కంభం: కారు అదుపు తప్పి కంభం చెరువులోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం సాయంత్రం ఇక్కడి చెరువు కట్టపై చోటుచేసుకుంది. వివరాలు.. హైదరాబాదులో నివాసం ఉంటున్న పి.వెంకటేశ్వరరెడ్డి కంభంలో బంధువుల ఇంటికి వచ్చారు. సోమవారం సాయంత్రం స్నేహితులతో కలిసి తన కారులో కంభం చెరువును చూసేందుకు వెళ్లారు. చిన్నకంభం తూము వద్ద కట్ట అంచున కారు పార్కింగ్ చేసి ఫొటోలు దిగారు. ఇంటికి వెళ్లేందుకు కారు స్టార్ట్ చేయగానే అదుపుతప్పి కట్ట మీద నుంచి పల్టీలు కొడుతూ చిన్న కంభం తూము వద్ద బోల్తా పడింది. కారు నడుపుతున్న వ్యక్తి ప్రమాదాన్ని గ్రహించి కిందకు దూకేయడంతో ప్రాణనష్టం తప్పింది. చెరువులో నుంచి కారును బయటకు తీసేందుకు క్రేన్ సహాయంతో ప్రయత్నాలు ప్రారంభించారు.

సమస్యల మంట.. వంటకు తంటా!

- పాఠశాలల్లో వంట గదులు లేక ఆరుబయటే వంటావార్పు
- వర్షాల్లో కార్మికులు, పొగ పీల్చలేక విద్యార్థులకు అవస్థ
- 3 నెలలుగా పెండింగ్‌లో మధ్యాహ్న భోజన బిల్లులు, వేతనం
- నిమ్మకు నీరెత్తినట్టుగా పాలకుల తీరు



రాచర్ల జెడ్పీ హైస్కూల్లో ఆరుబయట కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న కార్మికురాలు

రాచర్ల:

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సమస్యల మంటపై ఉడుకుతోంది. పాఠశాలల్లో వంట గదుల నిర్మాణం, భోజనం బిల్లులు, వేతనం చెల్లింపుపై ప్రభుత్వం కనీస శ్రద్ధ చూపకపోవడంతో కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు తంటాలు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాచర్ల మండలంలో ప్రాథమిక పాఠశాలలు 34, ప్రాథమికోన్నత 3, ఉన్నత పాఠశాలలు 6 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 3,032 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో పాలకవీడు, అనుమలవీడు, మేడంవారిపల్లె, సంగపేట, అనుములపల్లె, ఆకవీడు, కొత్తూరు, చినగానిపల్లె, అక్కపల్లె, చోళ్లవీడు స్పెషల్, పలుగుంటిపల్లె, రాచర్ల ఎస్‌పీజీ, రాచర్ల ఏబీఎమ్, జేపీ చెరువు స్పెషల్ పాఠశాలల్లో వంటగదులు లేవు. చోళ్లవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటగది లేకపోవడంతో స్కూల్ భవనంలోనే వంటవార్పు చేస్తున్నారు. వంట గది లేని పాఠశాలల్లో ఆరుబయటే వంటలు చేసుకుంటున్నారు. మరికొంత మంది తమ నివాసల వద్దే వంట చేసుకుని పాఠశాలకు తీసుకొస్తున్నారు. ఆరుబయట భోజనం తయారు చేసే క్రమంలో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొగ పీల్చుకుంటూ పాఠాలు వినలేక విద్యార్థులు సతమతమవుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, మెనూ అమలు చేయాలని పదే పదే చెబుతున్న అధికారులు క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలొస్తున్నాయి. ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేయకపోవడమే అందుకు కారణంగా కనిపిస్తోంది. వర్షాలు కురుస్తుండటంతో ఆరు బయట, కట్టెల పొయ్యిపై వంట చేయడం కష్టంగా ఉందని కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం గత 3 నెలలుగా బిల్లులతోపాటు వేతనం నిలిపేయడంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో వంట గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, వేతన బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలి



గడిచిన మూడు నెలలుగా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులతో పాటు వేతనాలు చెల్లించలేదు. బిల్లులు మంజూరులో జాప్యం చేస్తుండటంతో బయట అప్పు చేసి భోజనం పెట్టాల్సి వస్తోంది. మాకు పూట గడవడమే కష్టంగా ఉంది. అలాంటిది అప్పు చేసి మధ్యాహ్న భోజనం ఎలా పెట్టగలమో ప్రభుత్వం ఆలోచించాలి. కార్మికులకు ఇబ్బంది లేకుండా బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరుతున్నాం.

– ఎ.మహాలక్ష్మి, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలు, రాచర్ల

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



అన్నా రాంబాబును సన్మానిస్తున్న గాయం శ్రీనివాసరెడ్డి



అన్నా రాంబాబును సన్మానిస్తున్న సలీమ్ దితరులు, పక్కన షంషేర్ అలీబేగ్

తర్లుపాడు: వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ప్రజల పక్షాన పోరాడటమే కాకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తర్లుపాడు మండలంలోని పోతలపాడుకు చెందిన గాయం శ్రీనివాసరెడ్డిని నియమించిన సందర్భంగా ఆయన తర్లుపాడు, మార్కాపురం మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అన్నాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అన్నా మాట్లాడుతూ.. కార్యకర్తలందరూ ఏకతాటిపై పని చేయాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి, పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డిని గాయం శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షులు చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, మార్కాపురం ఎంపీపీ బండి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, పార్టీ నాయకులు నాలి కొండయ్య, మహేష్‌రెడ్డి, బి.గురవయ్య, రామిరెడ్డి, కె.సత్యనారాయణ రెడ్డి, శేషయ్య, గంట వెంకటరెడ్డి, అబ్దుల్ సుబానీ, ఎం.కొండారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మార్కాపురం పట్టణ అధ్యక్షుడిగా సలీమ్

మార్కాపురం: వైఎస్సార్ సీపీ మార్కాపురం పట్టణ అధ్యక్షుడిగా 20వ బ్లాక్ కౌన్సిలర్ షేక్ సలీమ్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా గొలమారి సత్యనారాయణరెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును సలీమ్, సత్యనారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. మార్కాపురంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని, ఏ సమస్య వచ్చినా కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సలీమ్ మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన అన్నా రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఏపి మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ అలీబేగ్, మున్సిపల్ మాజీ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, పార్టీ కౌన్సిలర్లు సిరాజ్, కొత్త కృష్ణ, బట్టగిరి తిరుపతిరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బొగ్గరపు శేషయ్య, డాక్టర్ మక్బుల్ బాషా, నాలి కొండయ్య, సోషల్ మీడియా రఫీ పాల్గొన్నారు.

పొదిలిలో తూతూమంత్రంగా గ్రీవెన్స్

- పట్టించుకోని అధికారులు
- కార్యాలయం వైపు తొంగిచూడని అర్జీదారులు



గ్రీవెన్స్‌లో పాల్గొన్న తహసీల్దార్

పొదిలి: కార్యాలయాల్లో అధికారులు చుట్టూ ఎన్ని మార్లు తిరిగినా ప్రయోజనం లేకుండా పోతోంది. స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై తమ గోడు చెప్పుకొంటున్నారు. పేద ప్రజలు వ్యయ ప్రయాసాలకోర్చి ఒంగోలు వెళ్లలేక పోతున్నారు. సోమవారం పొదిలి రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు తహసీల్దార్, ఆర్‌ఐ, ఐసీడీఎస్ ప్రతినిధి మాత్రమే హాజరై తూతూమంత్రంగా ముగించారు. ప్రతి వారం ఇదే తంతు కొనసాగుతోంది. ఎంపీడీఓ లేదా మరొక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు, విద్యుత్, విద్యాశాఖ, ఎక్సైజ్, నగర పంచాయతీ, ఇరిగేషన్, వ్యవసాయ, పోలీస్ శాఖ తదితర విభాగాల మండల స్థాయి అధికారులు హాజరై అర్జీదారుల సమస్యలు వీలైతే అక్కడికక్కడే పరిష్కరించాల్సి ఉంటుంది. అలా పరిష్కారం కాలని సమస్యను జిల్లా లేదా డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అర్జీకి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అర్జీదారునికి తెలియ చేయాల్సి ఉంది. ఇదంతా ఎందుకు వచ్చిన తలనొప్పి అనుకున్న అధికారులు అసలు గ్రీవెన్స్‌కే హాజరు కావటం లేదు. అధికారులే రాకుంటే తాము పోయి ఎవరికి సమస్య చెప్పుకోవాలో అర్థం కాక అర్జీదారులు కూడా అటువైపు తొంగి చూడటం మానేశారు. తహసీల్దార్ కూడా హాజరు కాని అధికారుల గురించి పట్టించుకోకపోవడంతో వ్యవహారం మరింత చులకనైందనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రీవెన్స్‌కు హాజరు కాని అధికారుల గురించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నానని తహసీల్దార్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. అయినా కూడా వారు లెక్క చేయడం లేదంటే ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నారా లేదా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అర్జీదారుని సమస్యలు తక్షణమే పరిష్కారం జరిగేవని, ప్రస్తుతం మాత్రం కూటమి నేతలు, కార్యకర్తల పనులు మాత్రమే చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రీవెన్స్‌ను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రీవెన్స్ నిర్వహణ తీరుపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. సోమవారం 2 అర్జీలు వచ్చాయని చెప్పారు. ఎంపీడీఓ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు కొందరు అధికారులు హాజరయ్యారని, మిగిలిన వారు దాదాపు హాజరవుతున్నారని చెప్పారు. వ్యవసాయాధికారి తనిఖీల్లో పాల్గొనడం వల్ల రాలేకపోయారని తహసీల్దార్ తెలిపారు.

వెటరన్ టెన్నిస్‌లో గిద్దలూరు వాసుల సత్తా



పోటీల్లో గెలుపొందిన గిద్దలూరు టెన్నిస్ క్రీడాకారులు

గిద్దలూరు రూరల్: కనిగిరిలోని టెన్నిస్ క్లబ్‌లో ఈ నెల 24వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నమెంట్‌లో గిద్దలూరుకు చెందిన సీనియర్ క్రీడాకారులు ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచినట్లు ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి తెలిపారు. 65 ఏళ్ల వయసు విభాగంలో కంచర్ల కోటయ్యగౌడ్, సోడా రామచంద్రారెడ్డి టీమ్ ప్రథమ స్థానంలో, 55 ఏళ్ల వయసు విభాగంలో షేక్ టపావలి, గంజి చంద్రశేఖర్ టీమ్ ద్వితీయ స్థానంలో, 45 ఏళ్ల లోపు పురుషుల విభాగంలో డాక్టర్ సందీప్, ఉక్కటపు మహేష్ మొదటి స్థానంలో నిలిచారని వివరించారు. వెటరన్ టెన్నిస్ విజేతలను గిద్దలూరు టెన్నిస్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ రంగారెడ్డి, క్లబ్ నిర్వాహకులు త్రిమూర్తిరెడ్డి, రాఘవులు, షేక్.ఖాదర్‌బాషా, శివప్రసాద్, కోచ్ మురళీరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలి

మార్కాపురం: ఎరువులు, పురుగుమందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవని ఏఓ బుజ్జిబాయి హెచ్చరించారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. స్టాక్‌తోపాటు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలో 3,500 ఎకరాలు పంట నమోదు చేశామని, ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం మార్కాపురంలో యూరియా కొరత లేదని చెప్పారు.

పెదారికట్లలో ఎరువుల దుకాణం తనిఖీ

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో భాగ్యలక్ష్మి ట్రేడర్స్, శ్రీలక్ష్మీనరసింహ ట్రేడర్స్, రుషిత ట్రేడర్స్ దుకాణాలను ఏఓ ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఏఎస్ఓ రవికాంత్, విక్రమ్ పాల్గొన్నారు.



పెదారికట్లలో తనిఖీ చేస్తున్న ఏఓ

రేషన్ దుకాణం సీజ్.. రిపోర్ట్ ఫ్రీజ్!



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

బేస్తవారిపేట: స్థానిక రెడ్డినగర్‌లోని ప్రభుత్వ చౌకధరల దుకాణాన్ని ఈనెల 1వ తేదీన సీజ్ చేసినప్పటికీ నేటి వరకు సంబంధిత రిపోర్ట్ ఎందుకు ఇవ్వలేదని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి ప్రశ్నించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జితేంద్రకుమార్‌తో మాట్లాడారు. తనిఖీలో స్టాక్ తేడా ఉందని సీజ్ చేసినప్పుడు వెనువెంటనే రిపోర్ట్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ 25 రోజులుగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఇవ్వలేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీ పేపర్లపై సంతకాలు తీసుకున్నారని, స్టాక్ విషయంలో తేడా చేస్తే డీలర్ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై పలుమార్లు గిద్దలూరులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను పలుమార్లు కలిసినా స్పందించకపోవడం సరికాదన్నారు. త్వరలోనే ఆహార సలహా సంఘం సమావేశం నిర్వహించాలని కోరారు.

ప్రహరీ కూల్చారు.. పునర్నిర్మాణం మరిచారు



జెడ్పీ హైస్కూల్ ముందు తొలగించిన ప్రహరీ



ప్రాథమిక పాఠశాలకు ఒకవైపు ఏపుగా పెరిగిన చిల్లచెట్లు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రహరీని కూల్చి ఏడాది దాటినా పునర్నిర్మాణంపై అధికారులు దృష్టి సారించలేదు. పాత సినిమాహాల్ సెంటర్ నుంచి ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డు వరకు సీసీరోడ్డు విస్తరణ కోసం ఏడాది క్రితం జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ప్రహరీని తొలగించారు. రోడ్డు నిర్మాణం పూర్తయినా నేటి వరకు ప్రహరీ పునర్నిర్మించే విషయాన్ని పట్టించుకోలేదు. పాఠశాల ఆవరణలోకి పశువులు, పందులు ప్రవేశిస్తుండటతో అపరిశుభ్రంగా మారి విద్యార్థులు, ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రాథమిక పాఠశాలను ఆనుకుని చిల్లచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. పైగా పాఠశాల పక్కనే పశువులు కట్టేస్తుండటంతో మురుగుకూపంగా మారుతోంది. ప్రహరీ లేకపోవడంతో విషసర్పాలు పాఠశాల ఆవరణలో ప్రవేశిస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ నిర్మాణ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు పలుమార్లు మండల సర్వసభ్య సమావేశం దృష్టికి తెచ్చినా అధికారుల నుంచి స్పందన కరువైంది. జెడ్పీ నిధులు వెచ్చించి పాఠశాలకు నూతన ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులతోపాటు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

గిద్దలూరు రూరల్: తెలంగాణలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో గిద్దలూరుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. 9 సంవత్సరాల విభాగంలో మిత్రా, సంసుల్, షరీఫ్, కౌసర్, ఫైద, హీనా గోల్డ్ మెడల్స్ సాధించారు. 10 సంవత్సరాల విభాగంలో రజిత, రిత్విక్, వరుణ్, మున్నా, నక్షత్ర, లితిక్, హేమంత్‌కుమార్ సిల్వర్ మెడల్స్ పొందారు. 18 నుంచి 20 ఏళ్ల వయసు సీనియర్ గర్ల్స్ విభాగంలో హేమలత, అభిరామ్, ఆయోషాలు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన అర్ధవీడు డీటీ

అర్ధవీడు: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా షేక్ పర్వీన్ సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీటీ ప్రసాద్ గిద్దలూరుకు బదిలీ కాగా, మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న బేస్తవారిపేట డీటీ షేక్ పర్వీన్‌ను అర్ధవీడులో నియమించారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆమెను తహసీల్దార్ చిలకల నాగార్జున రెడ్డి, కార్యాలయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని స్థానిక చెక్‌పోస్టు నుంచి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళల కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. కార్యక్రమంలో నిర్వాహకులు సుబ్బరాయుడు, కె.వెంకటేశ్వర్లు, రత్నమ్మ, తరుణ్, రమేష్ పాల్గొన్నారు.